# సాక్షి

## అన్నమయ్య జిల్లా

ఆదివారం । 29 । జూన్ । 2025






## బనకచర్ల గేమ్ ఛేంజర్ కాదు

బనకచర్ల గేమ్ ఛేంజర్ కాదు..సీఎం చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టే ప్రాజెక్టు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. -8లో



## నా కుమారుడు మఠాధిపతిగా అర్హుడు

వీరబ్రహ్మేంద్ర స్వామి మఠానికి తన పెద్ద కుమారుడు గోవిందస్వామి మఠాధిపతిగా అర్హుడని పూర్వపు మఠాధిపతి ద్వితీయ భార్య మారుతీ మహాలక్షుమ్మ తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.210 | రూ.260 |
| రెండోరకం | రూ.150 | రూ.200 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1482 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | - | - |
| సీబీ | 370 | 370 |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 47.700 కిలోలు

### న్యూస్‌రీల్

#### విద్యుత్‌లోడ్ క్రమబద్ధీకరణ గడువు 30


**రాయచోటి జగదాంబసెంటర్:** గృహ విద్యుత్ వినియోగదారులు తమ సర్వీసులకు అడిషనల్ లోడ్ కలిగి ఉన్న ఎడల వాటిని క్రమబద్ధీకరించుకోవడానికి 50 శాతం రాయితీతో కూడిన డెవలప్‌మెంట్ చార్జీలను చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షణాధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం రాయచోటిలో ఆయన మాట్లాడుతూ జిల్లా లోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే నేడు ఆదివారం అయినా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు జిల్లాలోని విద్యుత్ సంస్థకు చెందిన అన్ని కలెక్షన్స్ సెంటర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

#### 11 నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

**కడప ఎడ్యుకేషన్:** యోగి వేమన విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈఎడీ, ఎం.సి.ఎ రెండో సెమిస్టర్ విద్యార్థులకు జులై నెల 11 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు తెలిపారు. జులై 11, 14, 16, 18, 21, 23 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షల పూర్తిస్థాయి టైం టేబుల్ విద్యార్థులు చదువుతున్న కళాశాల నుంచి పొందాలని సీఈ సూచించారు.

# బాబు నోట.. మళ్లీ అదే మాట

- రైతుల కష్టాలకు దిక్కులేదు.. మదనపల్లెకు విమానాశ్రయమట
- 2019 ఎన్నికలకు ముందు ఇదేపాట పాడిన వైనం
- ఇప్పుడు మినీ ఏయిర్‌పోర్ట్ కడతానని ప్రకటన





మదనపల్లె పట్టణ వ్యూ

**మదనపల్లె:** ఉట్టికి ఎగరలేదుకాని స్వర్గానికి నిచ్చెన వేసిందనేది సామెత. ఇప్పుడీ సామెత సీఎం చంద్రబాబుకు సరిగ్గా అతుకుతుంది. కరువు, పంటలకు గిట్టుబాటు ధర లేదు, పెట్టిన పెట్టుబడిలో పైసా తిరిగి పొందక రైతులు వందల కోట్లు నష్టపోతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు దిక్కులేదు. రైతు సమస్యలను కనీసం పట్టించుకోని సీఎం చంద్రబాబు మదనపల్లెకు మినీ విమానాశ్రయం కడతానంటూ ప్రకటించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శుక్రవారం జరిగిన టూరిజం పెట్టుబడుల సమావేశంలో ప్రసంగించిన చంద్రబాబు మదనపల్లె ప్రాంతం ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలు, రైతుల ఇబ్బందులు పట్టించుకోకుండా ఇక్కడికి మినీ విమానాశ్రయం తెస్తానని ప్రకటించడం పక్కా వ్యాపార దృక్పథంతో వ్యవహరిస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. శాశ్వత కరువును పారదోలడంపై ఏనాడూ సమీక్షించని చంద్రబాబు బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌ను రాందేవ్ బాబాకు ఇచ్చేందుకు, ఆయన కోసమే అన్నట్టుగా మదనపల్లెలో మినీ విమానాశ్రయం కడతానంటూ గొప్పగా ప్రకటించడంపై మేధావులు, కార్మిక నేతలు మండిపడుతున్నారు. మదనపల్లె డివిజన్ రైతులు ఏడాదికాలంలో పండించిన దోస, కర్బూజ, టమాట, వేరుశెనగ, అల్లనేరేడు, మామిడి, వంగ పంటలకు కనీస ధర లేదు. ప్రతిపంటలోనూ తీవ్ర నష్టాలు చవిచూశారు. వీటిపై స్పందించని సీఎం చంద్రబాబు వ్యాపార సంస్థల కోసం విమానాశ్రయం తెస్తాననడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**అవసరం లేకున్నా...**

2019 ఎన్నికల సమయంలో చంద్రబాబు మదనపల్లెలో పర్యటించి ఇక్కడ విమానాశ్రయం కడతానని ప్రకటించారు. ఇక్కడ విమానాశ్రయం కట్టాల్సినంతటి అవసరం లేదు. ఆ స్థాయిలో ఫ్యూజిబులిటీ కూడా లేదు. ఇక్కడికి 100 కిలోమీటర్ల దూరంలో బెంగళూరు అంతర్జాతీయ, 130 కిలోమీటర్ల దూరంలో రేణిగుంట అంతర్జాతీయ, 120 కిలోమీటర్ల దూరంలో కడప విమానాశ్రయాలు ఉన్నాయి. అయినప్పటికీ ఇక్కడి ప్రజల చెవుల్లో పూవ్వులు పెట్టేందుకు ప్రయత్నించి విమానాశ్రయం పెడతానంటూ ప్రకటించారు. దీనిపై జోకులు వేసుకున్న ప్రజలు 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని ఓడించారు. అయితే ఈ మారు బాబా రాందేవ్ కోసమే అన్నట్టు ఆయన సమక్షంలో మదనపల్లెకు మినీ విమానాశ్రయం కడతానంటూ ప్రకటించారు. మదనపల్లె (హార్సిలీహిల్స్) అంతర్జాతీయ స్థాయి వెల్‌నెస్ సెంటర్‌గా అభివృద్ధి చెందాలని, అందుకు మినీ విమానాశ్రయం తెస్తామని, ఎవరూ అడక్కపోయినా, దాని అవసరం లేకపోయినా ప్రకటించి అందర్నీ విస్తుపోయేలా చేశారు. మదనపల్లె చుట్టూ మూడు విమానాశ్రయాలు ఉన్నా, ఇక్కడికి విమానాశ్రయం అవసరం లేకున్నా మళ్లీ అదే పాట పాడిన చంద్రబాబు వ్యాపార సంస్థల కోసమే ఈ మాటను లేవనెత్తారు. దీనివల్ల సామాన్య ప్రజలు, రైతులు, వ్యాపారులు ఒరిగేదేమి లేదు.

**రైతుల నోట్లో మట్టికొట్టి..**

మదనపల్లెకు విమానాశ్రయం అంటున్న సీఎం చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన రైతాంగ సంక్షేమ కార్యక్రమాలను రద్దుచేసి రైతుల నోట్లో మట్టి కొట్టిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. రూ.8,175,91 కోట్ల విలువైన మదనపల్లె డివిజన్‌కు చెందిన సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసి రైతులకు తీరని ద్రోహం చేశారు. రూ.759.50 కోట్ల ముదివేడు ప్రాజెక్టు, రూ.1,217.49 కోట్ల పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు నిలిపివేత, రూ.4,373.23 కోట్ల గాలేరు–నగరి, హంద్రీనీవా ప్రాజెక్టు అనుసంధానం పనులు రద్దు, రూ.1,825.69 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకాన్ని రద్దు చేసి ప్రజల, రైతుల అభివృద్ధి ఆకాంక్షలపై నీళ్లు చల్లారు.

### 2014-19లో ఇచ్చిన హామీల్లో కొన్ని..

పారిశ్రామికాభివృద్ధి కోసం బెంగుళూరు నుంచి అనంతపురంజిల్లా మీదుగా తంబళ్లపల్లె మదనపల్లె, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలను కలుపుతూ రింగ్ రోడ్ నిర్మాణం.. జిల్లాలో పాడి రైతుల ద్వారా 50 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి పెంచేలా ప్రణాళిక.. హార్టికల్చర్ హబ్‌గా తంబళ్లపల్లె.. పల్లెల్లో 400 నుంచి 500 పశువులకు వసతికి పశువుల హాస్టళ్లు, బయోగ్యాస్ ఉత్పత్తి.. తంబళ్లపల్లె టమాట రైతులకు రూ.10కోట్ల ప్యాకేజీ.. టమాట ఆధారిత పరిశ్రమను స్థాపనకు పెప్సికో కంపెనీతో సంస్థల ఏర్పాటు.. కురబలకోట మండలంలోని హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఐటీ సంస్థలను స్థాపన. ఇలా పదుల సంఖ్యలో హామీలు ఇచ్చిన చంద్రబాబు ఒక్కటీ నెరవేర్చలేదు.

### హార్సిలీహిల్స్ బాబాదే

పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌ను యోగా గురువు రాందేవ్ బాబాకు ఇచ్చేసినట్టే అన్న సంకేతాలను సీఎం చంద్రబాబు ఇచ్చేశారు. హార్సిలీహిల్స్‌కు చరిత్ర ఉంది, రాందేవ్ బాబా వెల్‌నెస్ సెంటర్ ప్రారంభిస్తే అందుకు అవసరమైన మౌలిక వసతులన్నీ కల్పిస్తానని ఆయనను ఉద్దేశించి ప్రకటించారు. ఏప్రిల్ 14న పతంజలి ప్రతినిధులు హార్సిలీహిల్స్‌లో పర్యటించి వెళ్లాక రాందేవ్ బాబా స్వయంగా ఈనెల 25న హార్సిలీహిల్స్ వచ్చి బాగుంది ప్రపంచ స్థాయి వెల్‌నెస్ సెంటర్ ప్రారంభిస్తామని ప్రకటించి..హార్సిలీహిల్స్ నచ్చేసిందని నేరుగానే చెప్పేశారు. ఇక్కడినుంచి వెళ్లిన రెండోరోజే చంద్రబాబు సమక్షంలో హార్సిలీహిల్స్‌ను ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెస్తానని రాందేవ్ బాబా చెప్పడం, దానికి చంద్రబాబు కొనసాగింపుగా వెల్‌నెస్ సెంటర్ కోసం అన్ని వసతులు కల్పించడమేకాక మినీ విమానాశ్రయం కూడా కడతానని అడక్కనే వరం ఇచ్చేశారు. దీంతో త్వరలోనే హార్సిలీహిల్స్ పతంజలి ఖాతాలోకి జమ కావడం ఖాయమైపోయింది.

# పంజంకు కన్నీటి వీడ్కోలు!



నివాళులు అర్పిస్తున్న మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి తదితరులు



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల, ప్రభావతమ్మ తదితరులు

- కడసారి చూసేందుకు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- సుకుమార్‌రెడ్డి పార్థివదేహం వద్ద నివాళులర్పించిన పెద్దిరెడ్డి, అంజద్‌బాషా తదితరులు

**సాక్షి రాయచోటి/రైల్వేకోడూరు అర్బన్:** వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి (64)కి పార్టీ నేతలు, శ్రేణులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శనివారం కన్నీటి వీడ్కోలు పలికారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ ఆప్యాయంగా పలుకరించడమే కాకుండా నవ్వుతూ మాట్లాడే పంజం సుకుమార్‌రెడ్డిని తలుచుకుని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఆయన తుదిశ్వాస విడిచిన విషయం అందరికీ తెలిసిందే. శనివారం ఉదయం అంత్యక్రియుల నిర్వహించారు. అంతకుముందు అన్నమయ్య, వైఎస్సార్ కడప, తిరుపతితో పాటు ఇతర జిల్లాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కన్నీటి నివాళి అర్పించారు. పంజం కుటుంబ సభ్యులతోపాటు బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

**నేతల నివాళి**

రైల్వేకోడూరు మండల పరిధిలోని అనంతరాజుపేట పంచాయతీ తూర్పుపల్లిలో పంజం సుకుమార్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకున్న పార్టీ కీలక నేతలు నివాళులర్పించారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ, కడప పార్లమెంట్ పరిశీలకులు, స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, ఆర్టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మాజీ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజం సుకుమార్‌రెడ్డి మృతి చెందారన్న విషయం తెలుసుకుని శుక్రవారం రైల్వేకోడూరుకు వచ్చిన సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి పంజం సుకుమార్‌రెడ్డి పార్థివ దేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం సుకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పంజం సందీప్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అలాగే జనసేన, టీడీపీ నాయకులు కూడా పంజం సుకుమార్‌రెడ్డికి నివాళులర్పించారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి కూడా నివాళులర్పించారు.

**ఘనంగా అంతిమ వీడ్కోలు**

తూర్పుపల్లిలోని పంజం సుకుమార్‌రెడ్డి ఇంటి వద్ద నుంచి అంతిమ యాత్ర సాగింది. పార్టీ శ్రేణులు, నేతలు, గ్రామస్తులు, కుటుంబీకులు భారీగా పాల్గొన్నారు. ఇంటి వద్ద నుంచి పంజం సుకుమార్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లి అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.



అంతిమయాత్రలో పాల్గొన్న జనవాహిని

### పార్టీపట్ల నిజాయితీ కలిగిన నాయకుడు: మాజీమంత్రి పెద్దిరెడ్డి

సీనియర్ నాయకులు పంజంసుకుమార్‌రెడ్డి మృతి చెందడం భాదాకరమని, అలాగే తను నమ్మిన పార్టీ, వైఎస్ఆర్ కుటుంబం పట్ల నిజాయితీకలిగిన నాయకుడని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సుకుమార్‌రెడ్డి రాజకీయాల్లో ఉన్ననాటి నుంచి తనకు పరిచయం ఉందని తెలిపారు. పార్టీ పటిష్టతకు నిబద్ధతతో పని చేసేవాడని తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్సీపీ, అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండదండలు అన్ని వేళలా ఉంటాయని తెలిపారు.

# కొత్తరైలు మార్గంలో తొలిప్రయాణం!

- తిరుపతి–నాందేడ్ మధ్య ప్రత్యేక రైలు
- జిల్లా వాసులు బాసర, షిర్డీ వెళ్లేందుకు అనుకూలం



ఎక్స్‌ప్రెస్‌రైలు

**రాజంపేట:** హైదరాబాద్ నుంచి తిరుపతికి కొత్తమార్గంలో తొలి ప్రయాణం అందుబాటులోకి రానుంది. జూలై 4 నుంచి నాందేడ్–తిరుపతి మధ్య తిరిగే రైలును పిడుగురాళ్ల–శావల్యాపురం మధ్య నూతనంగా నిర్మించిన మార్గం ద్వారా మార్కాపురం, నంద్యాల, కడప మీదుగా తిరుపతికి తొలిసారిగా నడపనున్నారు. నెమలిపురి, రొంపిచెర్ల రైలు కూత తొలిసారి వినపడనుంది. జూలై 11, 18, 25 తేదీల్లో తిరుపతికి, జూలై 6, 13, 20, 27 తేదీల్లో నాంధేడ్‌కు ఈ రైలు ప్రయాణిస్తుంది.

**టైమింగ్స్ ఇలా..**

నాందేడ్‌లో సాయంత్రం 4.30కి, బాసరకు 6గంటలకు, నిజామాబాద్‌కు 6.25కు చేరుకుంటుంది. కామారెడ్డి మీదుగా మేడ్చల్‌కు రాత్రి 8గంటలకు, చెర్లపల్లెకు 9.30గంటలకు వస్తుంది, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడిమీదుగా పిడుగురాళ్లకు రాత్రి 12.30గంటలకు చేరుకుంటుంది. దొనకొండ,మార్కాపుం రోడ్, కంభం, గిద్దలూరు మీదుగా నంద్యాల ఉదయం 5.30గంటలకు వస్తుంది. జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కడపకు 8.50కి చేరుకుంటుంది. నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట మీదుగా తిరుపతికి మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకుంటుంది. రిటర్న్ జర్నీలో తిరుపతిలో మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరుతుంది. కడపకు 4.15కు, నంద్యాలకు 7.45గంటలకు చేరుకుంటుంది. నాంధేడ్‌కు మరుసటిరోజు ఉదయం 9.30గంటలకు బయలుదేరుతుంది.

## క్లుప్తంగా

### రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**మదనపల్లె రూరల్ :** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం కర్ణాటక సరిహద్దులో జరిగింది. ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగి రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయింది. ఇదే సమయంలో బెంగళూరు నుంచి మదనపల్లె వైపు వస్తున్న కారు ఆపి ఉంచగా, పులిచెర్లకు చెందిన నరేంద్ర(25), ఎర్రావారిపాలెంకు చెందిన నవీన్(22) ద్విచక్రవాహనంలో మదనపల్లె వైపు వస్తూ నిలిపి ఉంచిన కారును వెనుక నుంచి ఢీకొన్నారు. ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కర్ణాటక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి



మృతి చెందిన జింక

**ములకలచెరువు :** మండలంలోని బురకాయలకోట టోల్‌గేట్ దగ్గర రోడ్డు దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం శనివారం ఢీకొనడంతో మృతి చెందింది. తొలుత ఇది తీవ్రంగా గాయపడింది. స్థానికులు గమనించి ఫారెస్టు అధికారి షబిన్‌తాజ్‌కు సమాచారం ఇచ్చారు. పశువైద్య శాలకు తరలిస్తుండగా చనిపోయింది. పోస్టుమార్టం అనంతరం ఖననం చేశారు.

# బనకచర్ల గేమ్ ఛేంజర్ కాదు

**వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

**రాయచోటి టౌన్ :** బనకచర్ల గేమ్ ఛేంజర్ కాదు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను మభ్యపెట్టే ప్రాజెక్టు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పదే పదే బనకచర్ల గేమ్‌ఛేంజర్ అని మాట్లాడుతున్నారన్నారు. గేమ్ ఛేంజర్ అంటే ఏమిటి.. ? దీని వలన ప్రజలకు ఏమి మేలు జరుగుతుందనే ఆలోచన నాయకులకు లేదా అని ప్రశ్నించారు. బనక చర్ల క్రాస్‌కు రూ.85 వేల కోట్లతో టెండర్లు పిలుస్తామని చంద్రబాబు చెబుతున్నారన్నారు. బనక చర్ల క్రాస్‌కు పోలవరం నుంచి రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి నీళ్లు వదిలితే ఇక్కడ కొత్తగా ఆయకట్టు పెరుగుతుందా అని అడిగితే సమాధానం లేదన్నారు. ఆయకట్టు స్థిరీకరిస్తున్నారా అని అడిగినా స్పందన లేదన్నారు. రాజధానిలో భవన నిర్మాణాల కోసం అడుగుకు రూ.12000 నుంచి 15000ల మధ్య రేటుతో టెండర్‌లు పిలవడం చూస్తే ఎంత ప్రజాధనం వృథా అవుతుందో తెలుస్తుందన్నారు. తాము రాజధానికి వ్యతిరేకం కాదని, ప్రజల సెంటిమెంట్‌ను ఉపయోగించుకొని ఈ రకమైన దోపిడీ చేయడం సరైనదేనా అని అడుగుతున్నామన్నారు.

రాయచోటి ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం ఎంతో కష్టపడి ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, పీవీ మిథున్‌రెడ్డిల సహకారంతో 45 శాతం పనులు పూర్తి చేయించామన్నారు. మిగిలిన పనులు పూర్తి చేయమంటే పలికే వారు లేరన్నారు. రాజధాని పేరుతో జరుగుతున్న అవినీతిని బయటకు రానీయకుండా దృష్టి మరల్చేందుకే చంద్రబాబు బనకచర్ల క్రాస్‌ను తెరపైకి తెచ్చారన్నారు. చంద్రబాబు నాయుడుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాలుగు ప్రశ్నలు సంధిస్తే దానికి సమాధానం ఇవ్వడం లేదన్నారు. వైఎస్ జగన్‌ను భూస్థాపితం చేస్తామని చంద్రబాబు మాట్లాడుతున్నారని అది ప్రజాస్వామ్యంలో జరగదన్నారు. ఎవరికీ అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గ్రహించాలన్నారు.

**జిల్లా కేంద్రం ఏర్పాటుకు కృషి చేశా..**

తొలుత తాను ఎమ్మెల్యే అయినప్పుడు గల్లా అరుణ కుమారి ద్వారా రూ.60 కోట్లతో రాయచోటిలో రింగ్ రోడ్డును నిర్మింపచేశానన్నారు. దాంతో రూ.15 వేల కోట్ల రియల్ ఎస్టేట్ జరిగిందని, అది సంపద సృష్టి అన్నారు. తహసీల్దార్ స్థాయిలో ఉన్న రాయచోటిని జిల్లా కేంద్రంగా మార్చామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టే మాటలు కాకుండా ప్రతిపక్షం అడుతున్న వాటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్, పట్టణ అధ్యక్షుడు నవాజ్, ఎస్పీఎస్ రిజ్వాన్, కౌన్సిలర్లు గౌస్‌ఖాన్, అల్తాఫ్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, మేధావుల ఫోరం నియోజక వర్గం అధ్యక్షుడు జానం రవీంద్ర యాదవ్, ఖలీల్, చిన్నమండెం సుక్కా అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి టీసీ ఇవ్వడంపై ఆందోళన

**మైదుకూరు :** మైదుకూరు మండలం వనిపెంటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కె.లోకేశ్వరి అనే విద్యార్థినికి ప్రిన్సిపాల్ టీసీ ఇచ్చి పంపడంపై విద్యార్థిని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. వనిపెంట ఎస్సీ కాలనీకి చెందిన లోకేశ్వరి గురుకుల పాఠశాలలో 6వ తరగతి పూర్తి చేసుకుంది. 7వ తరగతిలోకి ప్రవేశించాల్సి ఉన్న ఆ విద్యార్థిని పాఠశాల పునః ప్రారంభమై నెల రోజులు దాటినా పాఠశాలకు రాలేదు. శుక్రవారం లోకేశ్వరి పాఠశాలకు రావడంతో ప్రిన్సిపాల్ వి.నిర్మల టీసీ ఇచ్చి ఇంటికి పంపారు. ఆ విషయమై విద్యార్థిని తల్లిదండ్రులు వసంత, వీరయ్య పాఠశాల వద్దకు చేరుకుని తమ కుమార్తెను తిరిగి పాఠశాలలో చేర్చుకోవాలని ప్రిన్సిపాల్‌ను కోరగా ఆమె ససేమిరా అన్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో రావడంతో శనివారం పాఠశాల వద్దకు వెళ్లిన విలేకరులు లోకేశ్వరి విషయంపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరారు. లోకేశ్వరి సక్రమంగా చదవడం లేదని, పాఠ్యపుస్తకాలను చించడం, యూనిఫాం వేసుకోకుండా క్లాసులకు రావడం చేస్తూ ఉండేదని ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. తోటి విద్యార్థినులను కొట్టేదన్నారు. విద్యార్థిని విషయంపై కమిటీలో చర్చించి టీసీ ఇచ్చి పంపాలని నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు.

## లేబర్ కోడ్లు రద్దు కోరుతూ జులై 9న దేశవ్యాప్త సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

**రాయచోటి :** కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం తీసుకువచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు డిమాండ్ చేశారు. ఇందుకోసం జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. శనివారం రాయచోటిలోని సీఐటీయూ కార్యాలయంలో కౌలు రైతు సంఘం నాయకులు రమేష్‌బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్ర, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ చంద్రశేఖర్‌ల అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మెప్పు కోసమే ప్రధాని మోడీ కార్మిక వర్గం మీద భారాలు వేస్తూ లేబర్ కోడ్లను తెచ్చారన్నారు. విశాఖ ఉక్కు లాంటి సంస్థలో కార్మికులను తొలగించి ప్రైవేటీకరణ చేయడానికి పూనుకుంటే రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న విజన్ 2047 బూటకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆఫీస్ బేరర్స్ రవికుమార్, భాగ్యలక్ష్మీ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా వాసి దుర్మరణం



పేరారెడ్డి (ఫైల్)

**మదనపల్లె రూరల్ :** ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న రోడ్డుప్రమాదంలో ప్రకాశంజిల్లా వాసి దుర్మరణం చెందిన ఘటన శనివారం కర్ణాటక సరిహద్దులోని రాయల్పాడు సమీపంలో జరిగింది. ప్రకాశం జిల్లా పెద్దచెర్లోపల్లె పంచాయతీ ముర్గాని గ్రామానికి చెందిన ఎరుకులయ్య కుమారుడు పెద్దిరెడ్డి గారి పేరారెడ్డి(32) ద్విచక్రవాహనంలో మదనపల్లె మీదుగా బెంగళూరు వైపు వెళుతున్నాడు. మార్గమధ్యంలోని కర్ణాటక సరిహద్దు రాయల్పాడు వద్ద ఎదురుగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పేరారెడ్డిని స్థానికుల సహాయంతో రాయల్పాడు పోలీసులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి జేబులోని ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా ఆచూకీని గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రాయల్పాడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

## క్వాంటమ్ కంప్యూటింగ్ జీవన విధానాన్ని మార్చే టెక్నాలజీ



మాట్లాడుతున్న సురేంద్రన్

**కురబలకోట :** క్వాంటమ్ కంప్యూటింగ్ జీవన విధానాన్ని మార్చే టెక్నాలజీ కాగలదని పుదుచ్చేరిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ బి. సురేంద్రన్ అభిప్రాయపడ్డారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అనంతపురం జేఎన్‌టీయూతో కలసి క్వాంటమ్ న్యూరో మార్ఫిక్ కంప్యూటింగ్ ఫర్ సస్టైనబుల్ జనరేటివ్ ఏఐపై ఐదు రోజుల పాటు జరిగే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ లక్షల సంవత్సరాలు పట్టే లెక్కల్ని క్వాంటమ్ కంప్యూటర్లు నిమిషాల్లో చేయగలవన్నారు. భవిష్యత్తులో భద్రతా వ్యవస్థలు, పరిశ్రమలు, ఆరోగ్య సంరక్షణ, ఆర్థికం, మీడియా, కమ్యూనికేషన, సైబర్ భద్రత, విద్య, వాతావరణం, ఖగోళ పరిశోధన వంటి రంగాలను ప్రభావితం చేసేలా జనరేటివ్ ఏఐ వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ మానవ జీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. విద్యార్థులు, యువత ఈ రంగంలో రాణిస్తే కీలకమైన స్థానానానికి చేరుకోవచ్చన్నారు.



## పోలీసులపై దాడిచేసిన టీడీపీ నాయకుల అరెస్టు

**ఎస్పీ ఆదేశాలతో ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**మదనపల్లె రూరల్ :** జాతర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కోటవారిపల్లె తండాలో నిర్వహించిన పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులపై, స్థానిక టీడీపీ నాయకులు తిరగబడి గాయపరిచిన ఘటనలో మూడు నెలల తర్వాత తాలూకా పోలీసుల్లో చలనం వచ్చింది. శనివారం జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, పోలీస్ అధికారులతో నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో గ్యాంబ్లింగ్ కేసు విషయమై తాలూకా సీఐను హెచ్చరించడంతో పాటు పోలీసులపై దాడులు జరిగినా పట్టించుకోరా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆగమేఘాల మీద కోటవారిపల్లె తండాకు వెళ్లి ఆరుగురిని అదుపులోకి తీసుకుని, ఇద్దరిని అరెస్ట్ చూపారు. ఘటనకు సంబంధించి వివరాలు.. మండలంలోని కోటవారిపల్లె తండాలో ఈ ఏడాది మార్చి 18న లక్ష్మీనరసింహ స్వామి జాతర సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున జూద స్థావరం ఏర్పాటు చేశారు. జూదం నిర్వహిస్తుండగా, స్థానికులు కొందరు ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ కార్యాలయానికి తెలిపారు. దీంతో స్పందించిన ఆయన అప్పటికప్పుడు రాయచోటి నుంచి ప్రత్యేక బృందాలను పేకాట స్థావరంపై దాడులు జరపాల్సిందిగా ఆదేశించి పంపారు. వారు నేరుగా వెళ్లి పేకాట స్థావరంపై దాడులు జరపడంతో, టీడీపీ నాయకులు పోలీసులపై తిరగబడి, దాడులకు తెగబడ్డారు. దీంతో వారు విషయం ఎస్పీ కార్యాలయానికి తెలపడంతో ఆయన తాలూకా పోలీసులను అప్రమత్తం చేశారు. సీఐ కళా వెంకటరమణ, సిబ్బంది, ప్రత్యేక బృందాలతో కలిసి పేకాట స్థావరం వద్దకు వెళ్లగా వారు మరోసారి దాడులకు పాల్పడి పారిపోయారు. ఈ ఘటనపై కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, జిల్లా కేంద్రం రాయచోటిలో జీరో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. అక్కడి నుంచి కేసు తాలూకా పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, కేసు విచారణలో మూడు నెలలుగా తాలూకా పోలీసులు నిర్లక్ష్యం కనపరిచారు. శనివారం జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఈ ఘటనపై రివ్యూ చేస్తూ, పోలీసులపై దాడిచేసిన వారిని ఉపేక్షించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తాలూకా సీఐ కళావెంకటరమణ స్పందించి, కోటవారిపల్లె తండాకు వెళ్లి పోలీసులపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకులు మున్నా నాయక్, రజనీకాంత్, సీనా నాయక్, మోహన్ నాయక్, ఆంజనేయులు, అజయ్‌నాయక్‌లను అదుపులోకి తీసుకున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో కోటవారిపల్లె తండావాసులు తాలూకా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. గ్రామస్తులకు మద్దతుగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, స్టేషన్ వద్దకు వస్తున్నారని ప్రచారం జరిగింది. అయితే ఆయన రాలేదు. అనంతరం అదుపులోకి తీసుకున్న వ్యక్తుల్లో మోహన్ నాయక్, సీనా నాయక్‌లను అరెస్ట్ చూపుతూ, వైద్యపరీక్షల కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి కోర్టుకు హాజరుపరిచారు. ఘటనలో మరికొందరు నిందితుల ప్రమేయం ఉందని, త్వరలో వారిని అరెస్ట్ చేస్తామన్నారు.

**పెద్ద మొత్తంలో నగదు స్వాధీనంపై అనుమానాలు..**

కోటవారిపల్లె తండాలో మూడునెలల క్రితం పేకాట స్థావరంపై నిర్వహించిన తనిఖీల్లో టీడీపీ నాయకులు పోలీసులపై దాడులకు పాల్పడి పారిపోయారని, అయితే ఆ సమయంలో పేకాట స్థావరంలో ఉన్న పెద్ద మొత్తంలో నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారని గ్రామస్తులు అనుకుంటున్నారు. అందుకే ఈ ఘటన వెలుగులోకి రాకుండా ఇన్నాళ్లు దాచిపెట్టారని, కేసుల నుంచి నాయకులను తప్పించేందుకు బేరసారాలు జరిగాయన్నారు. అయితే, రాయచోటిలో పోలీసు ఫిర్యాదు మేరకు నమోదైన కేసు నిర్లక్ష్యంపై ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సీరియస్ కావడంతో గత్యంతరం లేక, తప్పనిసరి పరిస్థితుల్లో అరెస్ట్ చేశారని అంటున్నారు.

### నా కుమారుడు మఠాధిపతిగా అర్హుడు

**బ్రహ్మంగారిమఠం:** పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠానికి తన పెద్ద కుమారుడు గోవిందస్వామి మఠాధిపతిగా అర్హుడని పూర్వపు మఠాధిపతి ద్వితీయ భార్య మారుతీ మహాలక్షుమ్మ తెలిపారు. శనివారం బి.మఠంలో మహా నివేదిన మందిరంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి పెద్ద కుమారులు నలుగురిలో ఏ ఒక్కరూ మఠం ఆచారాలు పాటించలేదని అందుకు వారికి అర్హత లేదనేది పూర్వపు మఠాధిపతి వాదన అన్నారు. తన పెద్దకుమారుడు గోవిందస్వామి మఠం ఆచారాలపై ఎక్కువ మక్కువగా ఉండడంతో 2018లో పూర్వపు మఠాధిపతి వీలునామా రాశారన్నారు. తన తరువాత మఠాధిపతిగా తన రెండవ భార్య మొదటి సంతానం గోవిందస్వామి నియామకం జరగాలనేది పూర్వపు మఠాధిపతి ఆదేశం అన్నారు. వీలునామా ప్రకారం మఠాధిపతి నియామకం జరగాలని తాను కోరుతున్న సమయంలో పూర్వపు మఠాధిపతి పెద్ద భార్య కుమారులు అడ్డుతగలడంతో కోర్టును ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కోర్టు కూడా మఠాధిపతిని నిర్ణయించే బాధ్యత ధార్మిక పరిషత్‌కు అప్పజెప్పిందన్నారు. ధార్మిక పరిషత్ ద్వారా తమకు న్యాయం జరగక పోతే మళ్లీ కోర్టును ఆశ్రయిస్తామని ఆమె వివరించారు.

### ఖైదీల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

**కడప అర్బన్ :** ఖైదీలు తమ ఆరోగ్యంలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని అన్నారు. శనివారం కడప నగర శివార్లలోని కడప కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాన్ని ఆమె జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఖైదీలతో మాట్లాడి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాన్నారు. కారాగారం పరిసరాలను, వంటగదులను, వసతి గదులను, టాయిలెట్లను, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కారాగారం సూపరింటెండెంట్, ఇన్‌చార్జి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్ రాజేశ్వర్ రావు, ప్రత్యేక మహిళా కారాగారం సూపరింటెండెంట్ కృష్ణవేణి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, పారా లీగల్ వలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

### దేవుని కడప ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**కడప సెవెన్‌రోడ్స్ :** దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని తిరుమల-తిరుపతి దేవస్థానం జేఈఓ వల్లూరు వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన దేవుని కడప ఆలయాన్ని సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆలయ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న బాలాలయం కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. గర్భాలయం, పోటుగదిలో వర్షపు నీరు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. పుష్కరిణి వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులపై అధికారులతో సమీక్షించారు. కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓలు నటేష్‌బాబు, ప్రశాంతి, ఈఈలు నాగరాజు, సుమతి, ఆలయ అర్చకులు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసు నమోదు

**సిద్దవటం :** మండలంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్ట రీత్యా నేరమన్నారు. ఇతరులకు ఇబ్బందికరంగా మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కల్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### తల్లీబిడ్డల అదృశ్యం

**బి.కొత్తకోట :** తల్లి, ఇద్దరు బిడ్డల అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు హెడ్ కానిస్టేబుల్ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు..బి.కొత్తకోట బీసీ కాలనీకి చెందిన బత్తుల వాసు 14 ఏళ్ల క్రితం సునీలను వివాహం చేసుకున్నాడు. వీరికి సందీప్, కీర్తన సంతానం. శుక్రవారం ఉదయం వాసు పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చాడు. ఇంటిలో చూడగా భార్య, పిల్లలు కనిపించలేదు. ఆందోళనకు గురైన వాసు సోదరుడు ఆంజనేయులతో కలిసి బి.కొత్తకోట, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీనితో వాసు ఫిర్యాదు మేరకు అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రేవూరి శంకరయ్య (ఫైల్)

**ఒంటిమిట్ట :** మండల కేంద్రమైన ఒంటిమిట్టలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మొయిందిపల్లికి చెందిన రేవూరి శంకరయ్య (50)ను రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలోని కడప-చెన్నై జాతీయ రహదారిపై రాత్రి 10 గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

## భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న దళితులు

**వీరబల్లి :** దళిత, గిరిజనుల భూములు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గడికోట గ్రామ పరిధిలోని వేల్పుల మిట్ట హరిజనవాడ, గిరిజనులలు వాడల్లో ఉన్న వారికి సర్వే నెంబరు. 1128/7, 1128/9లో 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ఒక్కొక్కరికి ఎకరా చొప్పున పంపిణీ చేశారన్నారు. ఈ మధ్యకాలంలో కొంతమంది ఆ భూములను జేసీబీల ద్వారా చదును చేసే ప్రయత్నం చేస్తూ దళిత, గిరిజనుల కుటుంబాలను భయపెడుతున్నారన్నారు. అధికారులు స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు.

## డ్రాగా ముగిసిన కడప-కర్నూలు మ్యాచ్



135 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ కారుణ్య ప్రసాద్



89 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ షాహుల్ హమీద్



100 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన విష్ణు వర్ధన్ నాయుడు



72 పరుగులు చేసిన కర్నూలు బ్యాట్స్‌మన్ సాయి గణేష్

**కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో 6 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు విజయం**

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లో భాగంగా శనివారం మూడో రోజు కడప-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. 14 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 97 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 331 పరుగులు చేసింది. ఆ జట్టులోని విష్ణు వర్ధన్ నాయుడు 134 బంతుల్లో 100 పరుగుల సెంచరీ చేసి నాటౌట్‌గా నిలిచాడు. సాయి గణేష్ 72 పరుగులు చేశాడు. కడప జట్టులోని శివశంకర్ 3 వికెట్లు, ఆర్దిత్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో 765 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

**కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..**

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన నెల్లూరు-అనంతపురం మ్యాచ్‌లో అనంతపురం జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. శనివారం మూడో రోజు 173 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 99.2 ఓవర్లలో 405 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ 211 బంతుల్లో 135 పరుగులు, షాహుల్ హమీద్ 89 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని టీవీ సాయి ప్రతాప్ రెడ్డి 3 వికెట్లు, కేహెచ్ వీరారెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 24.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసి విజయం సాధించింది. ఆ జట్టులోని కేహెచ్ వీరారెడ్డి 37 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని షాహుల్ హమీద్ 2 వికెట్లు తీశాడు.

## కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు



తల్లి చెంతకు చేరిన పసికందు

**పులివెందుల రూరల్ :** పట్టణంలోని స్థానిక లక్ష్మీ హాలు సమీపంలో నివాసముంటున్న రాజకుళ్లాయమ్మ అనే మహిళ ఈనెల 18న కడప రిమ్స్‌లో మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఐదు రోజుల క్రితం రాజకుళ్లాయమ్మ కడప రిమ్స్ నుంచి పుట్టింటికి వచ్చింది. ఈ నేపథ్యంలోనే పసికందును రాజకుళ్లాయమ్మ స్నేహితురాలు కుమారి అపహరించి తీసుకెళ్లింది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితురాలు కుమారి తమ బంధువుల ఇంటి దగ్గర ఉండడంతో పులివెందుల పోలీసులు ఆమెను అరెస్టు చేసి పులివెందుల స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ మాట్లాడుతూ రాజకుళ్లాయమ్మ, కుమారి ఇద్దరూ పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నారని తెలిపారు. కుమారి శుక్రవారం రాజకుళ్లాయమ్మ ఇంటి దగ్గరికి వెళ్లి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పసికందును అపహరించి తీసుకెళ్లిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 24 గంటల్లోనే పసికందును కిడ్నాప్ చేసిన నిందితురాలిని అరెస్ట్ చేశామన్నారు. కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులను ఆయన అభినందించారు.

## అడ్మిషన్ల ప్రక్రియను విజయవంతం చేయాలి

**వేంపల్లె :** ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగే అడ్మిషన్ల ప్రక్రియను ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఉద్యోగులు విజయవంతం చేయాలని ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా కోరారు. శనివారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో క్యాంపస్ అడ్మిషన్ల ప్రక్రియపై ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలోని సెంట్రల్ లైబ్రరీలో అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ఈనెల 30, జూలై 1న రెండు రోజుల పాటు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అడ్మిషన్లకు ఎంపికైన విద్యార్థులకు ఇప్పటికే కాల్ లెటర్లు కూడా పంపామన్నారు. కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు మూడు సెట్లు జిరాక్స్ పత్రాలను, విద్యార్థి ఫొటోతోపాటు తల్లిదండ్రుల, సంరక్షకుల ఫొటోలను కూడా వెంట తీసుకుని రావాలన్నారు. సమావేశంలో అకడమిక్ డీన్ రమేష్ కైలాస్, అసోసియేట్ డీన్స్, సెక్యూరిటీ అధికారులు, పీఆర్ఓలు, అధ్యాపకులు పాల్గొన్నారు.